నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, సోమవారం 10 ఫిబ్రవరి 2025 | JANAGAON

## సర్వేతో ఒరిగిందేమీ లేదు



మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం చేపట్టిన బీసీ గణన వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. సర్వే ద్వారా వారికి ఒరిగిందేమీ లేదు. విద్యా, ఉద్యోగాల్లో దెబ్బతీసేలా జనాభాను తక్కువ చేసి చూపించిండ్రు. కాంగ్రెస్ పార్టీ సర్వే చేసి కాలం వృథా చేసింది. సీఎం రేవంత్ రెడ్డి కేవలం గొప్పలు చెప్పడానికి సరిపోతాడు గానీ బీసీలకు ప్రయోజనమేమీ చేయడం లేదు. కాంగ్రెస్ పార్టీ చేసిన కుటుంబ సర్వే అశాస్త్రీయంగా ఉంది. నమ్మశక్యం గాని గణాంకాలతో ప్రజలను గందరగోళంలో పడేసింది. సీఎం రేవంత్ రెడ్డికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు. వారికి రిజర్వేషన్ తగ్గించి అన్ని రంగాల్లో అన్యాయం చేయాలని కుట్ర చేస్తున్నడు.


– పైండ్ల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, మహబూబాబాద్

## తప్పుల తడకగా లెక్కలు



మొగుళ్లపల్లి: సమగ్ర కులగణన లెక్కలు తప్పులతడకగా ఉన్నాయి. రాష్ట్రంలో బీసీల జనాభాను తక్కువ చేశారు. ఇందులో 100 శాతం కుట్ర జరిగింది. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇవ్వాలన్న చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. భారత దేశ జనాభా చైనాను మించి పోతే, అందులో బీసీల జనాభా పెరగ లేదా?. బీహార్ రాష్ట్రంలో జరిగిన కుల గణనలో 26 ప్రశ్నలు సంధిస్తే.. రాష్ట్రంలో బీసీలను గందరగోళానికి గురిచేయడానికి 70 ప్రశ్నలు పెట్టారు.

– వేముల మహేందర్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, భూపాలపల్లి



'బీసీలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నది. ఇందులో భాగంగానే కుల గణనలో వారి జనాభాను తగ్గించి చూపించింది. నమ్మశక్యం గాని గణాంకాలతో ప్రజలను గందరగోళంలో పడేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.51 కోట్లు ఉంటే, 2014లో చేపట్టిన కుటుంబ సర్వేలో 3.68 కోట్లుగా తేలింది. ప్రస్తుత సర్వేలో 3.54 కోట్లకు ఎలా తగ్గిందో కాంగ్రెస్ సర్కారు, రేవంత్‌రెడ్డికే తెలియాలి. అప్పుడు 51.1 శాతం బీసీ జనాభా ఉంటే, ఇప్పుడు 46.25 శాతమే ఉందని చెబుతున్నారు. దాదాపు 20 లక్షల పైబడి బీసీలను మాయం చేశారు. రోజురోజుకూ జనాభా పెరుగుతుంటే తగ్గిందని చెప్పడాన్ని బట్టి ఆ సర్వే బోగస్ అని తెలుస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నాడు. నిష్పక్షపాతంగా మరోసారి కుల గణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలి' అని బీసీ సంఘాలు, నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

– నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 9

కులగణనతో తీవ్ర అన్యాయం

- జనాభా ఎలా తగ్గిందో రాష్ట్రప్రభుత్వం తేల్చాలి
- అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న రేవంత్ రెడ్డి
- నిష్పక్షపాతంగా మరోసారి కుల గణన చేపట్టాలి
- బీసీ కుల సంఘాలు, నాయకుల డిమాండ్

# బీసీలను అణగదొక్కేందుకే కాంగ్రెస్ కుట్రలు

## రాజకీయంగా అణగదొక్కాలని..



కేసముద్రం: బీసీ కులాలను రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కేందుకే వారి జనాభాను తగ్గించి చూపిస్తున్నారు. గతంలో రాష్ట్రంలో 51 శాతం జనాభా ఉన్నట్లు చూపిస్తే రేవంత్ రెడ్డి చేపట్టిన సర్వేలో 46 శాతమే ఉండడం విడ్డూరం. రోజురోజుకూ జనాభా పెరుగుతుంటే ఇప్పుడు తగ్గడాన్ని బట్టి కాంగ్రెస్ సర్వే బోగస్ అని అర్థమవుతున్నది. జనాభా ఎలా తగ్గిందో ప్రజలకు వివరించాలి. బీసీలను భవిష్యత్‌లో అన్ని రంగాల్లో ఎదగకుండా కుట్రలు చేస్తున్నరు. వారి మనోభావాలను కించపరిచేలా ప్రభుత్వం కుల గణన సర్వే ఫలితాలు ప్రకటించడం హేయమైన చర్య. ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి. నిష్పక్షపాతంగా మరోసారి కుల గణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలి.

– నీలం దుర్గేశ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు

## ఆమోదయోగ్యంలేని కుటుంబ సర్వే



హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వే ఆమోదయోగ్యంగా లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.51 కోట్లుగా ఉంటే, 2014లో సమగ్ర కుటుంబ సర్వేలో 3.68 కోట్లుగా ఉంది. ప్రస్తుత సర్వే ప్రకారం 3.54 కోట్లకు ఎలా తగ్గిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 51.1 శాతం బీసీ జనాభా ఉంటే, ప్రస్తుత సర్వేలో 46.25 శాతమే ఉంది. దాదాపు 20 లక్షల పైబడి బీసీలు మాయమైనట్లు కనబడుతున్నది. రాష్ట్రంలో 1.17 కోట్ల కుటుంబాలు ఉంటే సర్వేలో 1.12 కోట్లు మాత్రమే లెక్కలోకి తీసుకున్నారు. ప్రస్తుత సర్వే తప్పుల తడకగా ఉంది. గతంలో కేసీఆర్ చేసిన సర్వేనే కరెక్ట్. ఆ సర్వే 100% అని చెప్పి బీసీ సంఘాలు, మేధావులు, కాంగ్రెస్ ప్రభుత్వంలోని బీసీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కూడా చెబుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తామని చెప్పి అసెంబ్లీలో చర్చించి కేంద్రానికి వదిలేసి చేతులు దులుపుకున్నాడు. ఎన్నికల ప్రచారంలో బీసీలకు ఇచ్చిన హామీలను సంవత్సరం దాటినా అమలు చేయకుండా, అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నాడు. చేసిన సర్వే చెత్తబుట్టలో వేయడానికే తప్ప దేనికి పనికిరాదు.

– గొల్లపెల్లి వీరస్వామి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు(కేయూ)

## మళ్లీ కుల గణన చేపట్టాలి



రాష్ట్రంలో బీసీ కుల గణన సంపూర్ణంగా, నిజాయితీగా నిర్వహించడంలో రేవంత్ రెడ్డి సర్కారు విఫలమైంది. నామమాత్రంగా సర్వే చేసి చేతులు దులుపుకుంది. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో దాదాపుగా బీసీలు 56% శాతం ఉన్నారని తేలింది. కాంగ్రెస్ సర్కారు పదేళ్ల తర్వాత చేపట్టిన కుల గణన సర్వేలో బీసీల జనాభా తగ్గినట్లు చిత్రీకరించారు. బీసీలను అణగదొక్కాలని వారి జనాభాను తగ్గించినట్లు సర్వేలో చూపించారు. ప్రభుత్వం మళ్లీ పారదర్శకంగా కులగణన సర్వే చేయించి, అప్పుడే అందరికీ రిజర్వేషన్ ప్రకటించాలి. – నార్లగిరి రమేశ్, రజక సంఘం రాష్ట్ర నాయకుడు, కాజీపేట



రాష్ట్రంలో కుల గణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధన ఎలా అనే అంశంపై తెలంగాణ భవన్‌లో ఆదివారం జరిగిన బీసీ ముఖ్య నేతల సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

- పంట పొలాల్లో సీసీ కెమెరాలు
- వ్యవసాయ క్షేత్రం చుట్టూ 8 అమర్చిన రైతు రమేశ్

# నిఘా నేత్రం.. ఇక ఇదే సాక్ష్యం..!



వ్యవసాయ క్షేత్రంలోని కరెంటు స్తంభానికి అమర్చిన సీసీ కెమెరా, (ఇన్‌సెట్) తాటిచెట్టుకు ఏర్పాటు చేసిన కెమెరా

దేవరుప్పుల, ఫిబ్రవరి 9 : ఇప్పటివరకు సీసీ కెమెరాను వీధులు, దుకాణాలు, ఇళ్లల్లోనే చూశాం. దొంగతనాలు, ప్రమాదాలను పసిగట్టేందుకు వినియోగించే ఈ నిఘా నేత్రం ఇప్పుడు పంట పొలాలకూ విస్తరించింది. నేర పరిశోధన, విచారణలో పోలీసులు విరివిగా వాడే సాంకేతిక సాధనం ఇదొక్కటే. అయితే జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సీతారాంపూర్‌లో తొలుపునూరి రమేశ్ అనే రైతు దొంగల బెడద నుంచి తప్పించుకునేందుకు తన వ్యవసాయ క్షేత్రానికి నాలుగు దిక్కులా ఎనిమిది సీసీ కెమెరాలు అమర్చాడు. ఈ రోజుల్లో దొంగలు వ్యవసాయ మోటర్ల స్టార్టర్లు, కాపర్ వైర్లు, ఇతర పనిముట్లనే గాక ఇంకో అడుగు ముందుకేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను సైతం రాత్రిరాత్రికి విప్పి ఎత్తుకెళ్లడం సాధారణమైపోయింది. అంతేగాక భూ తగాదాల కారణంగా హద్దుల్లో పాతిన ఫెన్సింగ్‌లను తొలగించడం గొడవలకు దారి తీస్తోంది. తనకు ఎదురైన అనుభవాలతో విసిగిపోయిన రమేశ్ ఇక వీటికి సీసీ కెమెరాలే పరిష్కారమని భావించి తన పొలం చుట్టూ కరెంటు స్తంభాలకు, తాటిచెట్లకు ఇలా సోలార్ సిస్టంతో నడిచే సీసీ కెమెరాలను అమర్చాడు.

## పోలీసు కేసు పెడితే సాక్ష్యం అడిగారు..



నా వ్యవసాయ క్షేత్రంలో స్టార్టర్ ఎత్తుకెళ్లారు. భూతగాదాల వల్ల రాత్రికి రాత్రే ఫెన్సింగ్ రాళ్లు తొలగించారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడితే ఎలా రుజువు చేస్తావని అడిగారు. అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనలకు తాను ఎలా సాక్ష్యం చూపిస్తానని చెప్పిన. ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో కొందరి సూచనల మేరకు ఇలా సీసీ కెమెరాలు పెట్టా.

– తొలుపునూరి రమేశ్, రైతు, సీతారాంపూర్

# ఎన్నికలకు ముందే హామీలు అమలు చేయాలి

లేదంటే ప్రజా తిరుగుబాటు తప్పదు

- కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో రైతుల ఆత్మహత్యలు
- రూ.432కోట్ల వడ్ల బోనస్ పెండింగ్
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఫిబ్రవరి9: స్థానిక సంస్థల ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేసి గ్రామాల్లోకి రావాలని, లేదంటే ప్రజా తిరుగుబాటు తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం నర్సంపేటలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి తీరా 50 శాతం మందికి కూడా చేయలేదన్నారు. రూ.2లక్షల పైన రుణం ఉన్న వారు మిగతా డబ్బులను బ్యాంకులకు చెల్లించి మళ్లీ అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా రూ.15 వేలిస్తామని చెప్పి రూ.12వేలకు తగ్గించడం దారుణమన్నారు. కాంగ్రెస్ వాయిదాలతో కాలం వెల్లదీస్తుందని, పెట్టుబడి సాయానికి కోతలు పెట్టిందని ఆరోపించారు. నేటికీ రైతు భరోసా రైతు ఖాతాల్లో జమ కాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. జనవరి 26న రాజ్యాంగం అమలైన రోజు ప్రజలకిచ్చిన హామీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పి రాజ్యాంగాన్ని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమా రు 86,40,000 క్వింటాళ్ల ధాన్యానికి సంబంధించిన రూ.432 కోట్ల బోనస్ చెల్లింపులు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటి కోసం రైతులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రెండో పంటకు సిద్ధం కావాల్సిన రైతులు బోనస్ డబ్బుల కోసం తిరగాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ప్రైవేట్ మార్కెట్‌లో రూ.3వేల వరకు ధర ఉన్నా బోనస్ కోసం రైతులు ప్రభుత్వాన్ని నమ్మి ధాన్యాన్ని విక్రయించారని పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలోనే రైతులు సుభిక్షంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం దండగలా మారిందని విమర్శించారు. కాంగ్రెస్ అనాలోచిత నిర్ణయాలతో రైతులు ఆత్మహత్యల కు పాల్పడడం బాధాకరమని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే రూ.2లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతు భరోసా, అన్ని పంటలకు బోనస్, కౌలు రైతులకు రైతు భరోసాను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న బోనస్ డబ్బులను విడుదల చేయాలని రైతుల పక్షాన బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నదన్నారు.

## పరుపాటి నేతృత్వంలో 200 మంది పార్టీలో చేరిక

రాయపర్తి, ఫిబ్రవరి 9: అధికార కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగిపోయిన మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో గులాబీ గూటికి చేరుకుంటున్నారు. ఆదివారం మండలంలోని జేతురాంతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జేతురాంతండా, రావుల తండా, విద్యానగర్ తండాలకు చెందిన సుమారు 200 మంది గిరిజనులు తమ కుటుంబాలతో సహా ర్యాలీగా తరలి వచ్చి బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి మండలాధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్‌తో కలిసి ఆయన గులాబీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు, లేతాకుల రంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, భూక్యా సురేందర్, రాథోడ్‌నాయక్, గారె నర్సయ్య, సంది దేవేందర్‌రెడ్డి, గజవెల్లి ప్రసాద్, అయిత రాంచందర్, చందు రామ్‌యాదవ్, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, కోల సంపత్, ఎల్ల స్వామి, రవినాయక్, మహేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లోకి వలసల వెల్లువ..



పార్టీలో చేరిన వారితో పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

# నేడు డిజటల్ ఏరియల్ సర్వే

- వర్ధన్నపేట, తొర్రూరు, నర్సంపేట, పరకాల తదితర పట్టణాల్లో ఏడీఎస్
- హెలికాప్టర్‌కు ఆధునిక కెమెరాలు అమర్చి భూమి వివరాల నమోదు

కాజీపేట, ఫిబ్రవరి9 : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏరియల్ భూ సర్వేలో భాగంగా సోమవారం వర్ధన్నపేట, తొర్రూరు, నర్సంపేట, పరకాల తదితర పట్టణాల్లో డిజిటల్ సర్వే చేయనున్నారు. 'నక్ష' పథకంలో ఎలాంటి ప్రణాళికలు లేని చిన్న పట్టణాలను ఎంపిక చేసుకున్న కేంద్ర బృందం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కెమెరాలను అమర్చి హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే చేస్తున్నది. చిన్న పట్టణం, గ్రామాల్లోని చెరువులు, కాల్వలు, రోడ్లు, రైలు మార్గాలు, హై టెన్షన్ విద్యుత్ వైర్లు తదితర అంశాలను సర్వే చేసి అక్షాంశాలు, రేఖాంశాలను నమోదు చేయడంతో పాటు అన్ని ఫొటోలు, వీడియోలను తీసుకుంటుంది. ఈ సందర్భంగా సర్వే బృందం ప్రతినిధులు మాట్లాడుతూ ఆదివారం జగిత్యాల నుంచి హుస్నాబాద్ మీదుగా చిన్న పట్టణాలు, గ్రామాలను సర్వే చేశామన్నారు. సాయంత్రం కావడంతో సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాలతో సెయింట్ గ్యాబ్రియల్ మైదానంలో హెలికాప్టర్‌ను దింపామని తెలిపారు. సోమవారం వర్ధన్నపేట, తొర్రూరు, నర్సంపేట, పరకాల తదితర పట్టణాల్లో ఏరియల్ డిజిటల్ సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో సర్వే నిర్వహిస్తామని చెప్పారు.



సెయింట్ గ్యాబ్రియల్ మైదానంలో ల్యాండ్ అయిన డిజిటల్ భూ సర్వే హెలికాప్టర్



గతేడాది మార్చి 7న లైట్స్ షోను ప్రారంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సురేఖ

ఓరుగల్లు కోటలో ప్రారంభించిన ఇల్యుమినేషన్ లైట్స్ అండ్ సౌండ్ షో ఫ్లాప్ షోగా మారింది. పురావస్తు శాఖ అధికారుల అలసత్వమో.. ఎన్నికలకు ముందే మమ అనిపించాలనే కేంద్ర మంత్రుల ఆరాటమో కాని.. రూ. కోట్లు వెచ్చించి తెచ్చిన పరికరాలు పిచ్చుకలకు ఆవాసాలుగా మారాయి. పోటాపోటీ నినాదాలతో కేంద్ర, రాష్ట్ర మంత్రులు అట్టహాసంగా ప్రారంభించి పదకొండు నెలలైనా ఇప్పటికీ లైటు వెలగడం లేదు.. సౌండ్ వినిపించడం లేదు. హైదరాబాద్ గోల్కొండ ఖిల్లాను మించి ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పకోవడంతో ఆసక్తిగా వస్తున్న పర్యాటకులు ఈ ప్రదర్శన ఆదిలోనే ఆగిందని తెలుసుకొని నిరాశ పడుతున్నారు. చేసేదేమీ లేక టీజీటీడీసీ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న సౌండ్ అండ్ లైట్స్ షోను వీక్షించి వెళ్తున్నారు.

– ఖిలావరంగల్, ఫిబ్రవరి 9

- అట్టహాసంగా ఇల్యుమినేషన్ లైట్స్ అండ్ సౌండ్ షో ప్రారంభం
- పోటాపోటీగా పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- 11 నెలలైనా అందుబాటులోకి రాని ప్రదర్శనలు
- పిచ్చుకలకు ఆవాసాలుగా రూ.5 కోట్ల పరికరాలు
- ఓరుగల్లు ఖిల్లాలో కేంద్ర పురావస్తు శాఖ నిర్వాకం
- చూసేందుకు వచ్చి నిరాశతో వెళ్తున్న పర్యాటకులు

# ఫ్లాప్ షో!

ఇక్కడ లైటు వెలగదు.. సౌండ్ వినిపించదు

ఓరుగల్లు కోటలోని కీర్తితోరణాల మధ్య ఇండియన్ ఆయిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫసాడ్ (ఇల్యుమినేషన్ లైట్స్ అండ్ సౌండ్ షో) లైట్లను గత ఏడాది మార్చి 7న నాటి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖతో కలిసి ప్రారంభించారు. 363 లైట్లు, 5 ప్రాజెక్టర్లతో రూపొందించిన షోకు రూ. 5 కోట్లు వ్యయం చేశారు. ప్రారంభం రోజున ఈ ప్రదర్శనను తిలకించిన అతిథులు, ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. కాకతీయుల ప్రాశస్త్యాన్ని, చరిత్రను తెలిపేలా శాశ్వతంగా కార్యక్రమం ఏర్పాటు చేయాలని మంత్రి కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయితే ఎన్నికల కోడ్ వస్తుందనే సమాచారంతో అసంపూర్తిగా ఉన్న ఫసాడ్ లైట్లను అధికారులు ఆగమేఘాల మీద సిద్ధం చేయడంతో మంత్రులు ప్రారంభించారు. 11 నెలలైనప్పటికీ లైట్స్ అండ్ సౌండ్ షోను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారు. గోల్కొండ కోటలో రంగు రంగుల లైట్లతో కనువిందు చేస్తున్న షోకు మించి ఖిలావరంగల్‌లో ఉంటుందన్న విస్తృత ప్రచారంతో పర్యాటకులు, చరిత్రకారులు దూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. అయితే లైట్స్ షో లేదని తెలియడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పని చేయనప్పుడు ప్రచారం ఎందుకంటూ విమర్శిస్తున్నారు. చేసేదేమీ లేక టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైట్స్ అండ్ సౌండ్ షోను వీక్షించి వెళ్తున్నారు.

### ప్రాజెక్టర్లలో పిచ్చుక గూళ్లు

కీర్తి తోరణాల మధ్యలో కోట్లాది నిధులతో ఏర్పాటు చేసిన లైట్లు, ప్రాజెక్టర్ల నిర్వహణను కేంద్ర పురావస్తు శాఖ గాలికొదిలేసింది. ప్రదర్శనే లేనప్పుడు నిర్వహణ ఎందుకనుకున్నారో.. ఏమో.. పట్టించుకోవడం మానేశారు. దీంతో ఎంతో విలువైన యంత్ర సామగ్రి, లైట్లు, ప్రాజెక్టర్లలో పిచ్చుకలు గూళ్లు పెట్టుకుంటున్నాయి. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రారంభం రోజునే అటకెక్కించిన లైట్స్ షోను పర్యాటకుల ముందుకు తీసుకురావాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు.





కోటలోని కీర్తి తోరణాల మధ్య ఏర్పాటు చేసిన లైట్స్ షో ప్రాజెక్టర్లలో పిచ్చుకలు పెట్టిన గూళ్లు